# ప్రజానేత ఎర్రబెల్లిని ఢీకొనడం కష్టమే..

- కలిసివస్తే పనిచేస్తాం, లేకపోతే మాదారి మాదే
- ఝాన్సీరెడ్డివి ఒంటెద్దు పోకడలు
- కాంగ్రెస్ అసమ్మతి నేతల నియోజకవర్గ సమావేశంలో ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి



దేవరుప్పలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి

దేవరుప్పుల, అక్టోబర్ 29: పాలకుర్తి నియోజకవర్గంలో ప్రజానేత, బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రంగంలో ఉన్నారని, ఆయనను ఢీకొనాలంటే కష్టతరమని పాలకుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశించిన ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించగా ఝాన్సీరెడ్డి ఒంటెత్తు పోకడలపై కాంగ్రెస్ అసమ్మతి నాయకులు పాల్గొన్నారు. దీనికి నేతృత్వం వహించిన ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థిని తానే అని ఇన్నాళ్లూ చెప్పుకుని తిరిగిన ఝాన్సీరెడ్డి ఒంటెద్దు పోకడలతో పార్టీకి ఇప్పటికే తీవ్ర నష్టం జరిగిందన్నారు. కనీస రాజకీయ అనుభవం లేని ఝాన్సీరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించబడిన యశస్వినీరెడ్డి బాహుబలి లాంటి, ఓటమి ఎరుగని నాయకుడు మంత్రి ఎర్రబల్లిని ఢీకొనడం వారివల్ల అవుతుందా అని ప్రశ్నించారు. ఝాన్సీరెడ్డి పోకడవల్ల నియోజకవర్గంలో సీనియర్ కాంగ్రెస్ లీడర్లంతా నేటికి పార్టీకి దూరంగా ఉంటున్నారని తెలిపారు. ఝాన్సీరెడ్డి కలుపుకుపోతే సరేసరి, లేనట్లయితే తమ దారి తమదని అభిప్రాయాన్ని వారంతా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి హామీతో తామంతా ఇప్పటికీ పార్టీలో కొనసాగుతున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ ఓటమి పాలుకాక తప్పదని వారన్నారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి దామోదర్‌రెడ్డి, పాలకుర్తి మాజీ ఎంపీపీ యాకస్వామి, అల్లం ప్రదీప్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ప్యాక్స్ మాజీ చైర్మన్ భాస్కర్, రవి,నర్సింగరావు, జాటోత్ రాహుల్‌నాయక్, మహేందర్‌రెడ్డి, సలాం, రాహుల్‌రెడ్డి, కాసాని ఎర్రయ్య పాల్గొన్నారు



కొండాపురంలో మాట్లాడుతున్న పసునూరి నవీన్

### అభివృద్ధి, సంక్షేమ పథకాలే

## మంత్రి ఎర్రబెల్లి విజయానికి దోహదం

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 29: సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పాలకుర్తి నియోజక వర్గానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండాపురం, బమ్మెర, దర్దేపల్లి, టీఎస్‌కే తండా, హత్యా తండా గ్రామాల్లో మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధి పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్, 24 గంటల నాణ్యమైన విద్యుత్, రైతుబంధు రైతుబీమా పథకాలను ప్రవేశ పెట్టిన మహాత్ముడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. పాలకుర్తి మండలంలోని గ్రామాలతోపాటు ఆలయాలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభివృద్ధి చేశారన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, జోగు గోపీ, మంద ఎల్లయ్య, మంగ సోమన్న, లావుడ్యా దేవానాయక్, దరావత్ యాకూబ్, దేవసాని నరేశ్, దరావత్ బాలునాయక్, బానోత్ మహేందర్, బత్తిని గోపాల్, దార శంకరయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా సుందర్‌రాంరెడ్డి

## బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

దేవరుప్పుల, అక్టోబర్ 29: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందాయని, దీంతో బీఆర్ఎస్‌పై ప్రజల పెరిగి నందున ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకుడు పల్లా సుందర్‌రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కామారెడ్డిగూడెం, పెదమడూరు గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ లెవల్ ఎన్నికల ప్రచారానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను ఓట్లడిగే హక్కు బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి మంత్రి ఎర్రబెల్లిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మంత్రి దయాకర్‌రావు నియోజకవర్గంలో అభివృద్ధి చేపట్టిన అభివృద్ధి పనులు, ఇంటింటికీ అందిన సంక్షేమాలే విజయానికి దోహదపడుతాయన్నారు. ఈ నేపథ్యంలో బూత్ లెవల్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ మండల నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు ఎల్లబోయిన గిరియాదవ్, బండారు రాములు, మండల నాయకుడు బస్వ మల్లేశ్, మండల ఇన్‌చార్జి మనోహర్‌రావు, గ్రామ ఇన్‌చార్జిలు ఈదునూరి నర్సింహారెడ్డి, తీగల సత్తయ్య, చింత రవి, హనుమంతు, ఏల సుందర్, కామారెడ్డిగూడెం, పెదమడూరు ఎంపీటీసీలు మహ్మద్ జాకీర్, పానుగంటి గిరి, ఓడపల్లి రవీందర్, దుద్దుల పరశురాములు, కోతి ప్రవీణ్, చింత సోమయ్య, పెద్దారెడ్డి, బిళ్ల యాదవరెడ్డి, మొల్గూరి రమేశ్, మానుపాటి వెంకటేశ్, కృష్ణ. నవీన్ పాల్గొన్నారు.

## మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల, అక్టోబర్ 29 : మండల కేంద్రానికి చెందిన జూబ్లీహిల్స్ యూత్ సభ్యులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎండీ హనీఫ్, నాయకులు కడారి ఉమేశ్, సిలువేరు యాకయ్య, ముక్కెర నాగరాజు, కోటగిరి అనిల్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని రాగ్య తండాకు చెందిన యూత్ నాయకులు సైతం బీఆర్ఎస్‌లో చేరారు.



సంప్రోక్షణ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

### క్షీరగిరి క్షేత్రంలో

## స్వామివారికి సంప్రోక్షణ

పాలకుర్తి, అక్టోబర్ 29: స్వయంభు సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ఆదివారం సంప్రోక్షణ నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఆలయాన్ని తెరిచారు. పాక్షిక చంద్రగహణం సందర్భంగా శనివారం క్షీరగిరి క్షేత్రం ప్రధాన అనుబంధ ఉపాలయాలకు ద్వారబంధనం చేశారు. చంద్రగ్రహణం వీడిన అనంతరం స్వామివారి క్షేత్రంలో ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు ఏకకాలంలో శుద్ధి చేశారు. గణపతి పూజ , గోమయం, గోమూత్రంతో కూడిన పుణ్యాహవాచనం నిర్వహించారు. ఈ .కార్యక్రమంలో అర్చకులు దేవగిరి లక్ష్మన్న, మత్తగజం నాగరాజు, దేవగిరి అనిల్‌శర్మ ,దేవగిరి సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

## కడియం శ్రీహరికి వడ్డెర సంఘం సంపూర్ణ మద్దతు



కడియం శ్రీహరితో వడ్డెర సంఘం నాయకులు

చిల్పూరు,అక్టోబర్ 29 : స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని వడ్డెర సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం హనుమకొండలో కడియం శ్రీహరిని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో పల్లగుట్ట వడ్డెర సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కడియం శ్రీహరికి మద్దతు తెలిపి విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివరాత్రి ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకుడు 7వ వార్డు సభ్యుడు బొమ్మిశెట్టి మల్లేశ్, శివరాత్రి కొమురయ్య, రాజయ్య, గొలుసుల వెంకటేశ్ , శివరాత్రి సంపత్, కత్తురు శ్రీను పాల్గొన్నారు.



కొడకండ్లలో వానరాలను బంధించిన వివరాలు వెల్లడిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

## చల్లా గెలుపు కోసంఅరుణాచలంలో గిరిప్రదక్షిణ

దామెర, అక్టోబర్ 29 : మండలంలోని ముస్త్యాలపల్లి సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, కార్యకర్తలు తమిళనాడు రాష్ట్రం అరుణాచలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శివాలయాన్ని సందర్శించి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని ఆదివారం శివుడికి గిరిప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, మరోసారి భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోతుల బెడద నుంచి విముక్తి

కొడకండ్ల, అక్టోబర్ 29 : మండలంలోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న కోతుల బెడద సమస్య నివారణకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నియోజకవర్గంలో చర్యలు చేపట్టారు. కోతులను పట్టించి అడవిలో వదిలేయడం కోసం నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూ.6 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా మండలంలో ఆదివారం 205 కోతులను పట్టి అడవిలో వదిలారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# గంగదేవిపల్లిలో మేడ్చల్, మల్కాజ్‌గిరి బృందాల పర్యటన

గీసుగొండ, అక్టోబర్ 29: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లికి ఆదివారం ఎస్‌ఎం సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా మల్కాజ్‌గిరి మండలంలోని రావత్‌కోల్, నూతన్‌కల్, మెదక్ జిల్లా శివంపేట మండలం ఏదులాపురం నుంచి 50మంది మహిళలు గ్రామాన్ని సందర్శించారు. వారికి గ్రామాభివృద్ధిని శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి క్లుప్తంగా వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. గ్రామంలో మద్యపానం నిషేధమని, అందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వాడుతారని తెలియజేశారు. వంద శాతం పన్నులు చెల్లిస్తామని పేర్కొన్నారు. కమిటీల సభ్యులు సరోజన, మేడిద సుశీల పాల్గొన్నారు.




గంగదేవిపల్లిని సందర్శించిన బృందంతో శిక్షణ మేనేజర్ రాజమౌళి